క్లుప్తంగా

రేపు సదర్ సమ్మేళనం

జడ్చర్ల టౌన్: యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో ఆదివారం రాత్రి సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు విశ్వేశ్వర్ శుక్రవారం తెలిపారు. ఉత్సవంలో హైదరాబాద్ నుంచి శిక్షణ పొందిన రెండు గేదెలు వస్తాయని, స్థానికంగా ఉన్న గేదెలు సైతం పాల్గొంటాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరవుతారని వెల్లడించారు. నియోజకవర్గంలోని యాదవులు పెద్ద సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.

రైతులపై పోలీసుల హింసను ఖండిస్తున్నాం

మహబూబ్‌నగర్ రూరల్: వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతులపై పోలీసుల మూడో డిగ్రీ హింసను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అమానుష చర్యలు ప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మా విలేజ్ కోసం వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన శాంతియుత నిరసన తర్వాత చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. నవంబర్ 11న ప్రజావేదికలో లగచర్ల రైతులు తమ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడంపై తమ ఆందోళనను వ్యక్తం చేశారని, శాంతియుతంగా ఉండాల్సిన నిరసన పోలీసుల కఠినమైన ప్రతిస్పందన కారణంగా ఉద్రిక్తతకు దారి తీసిందని తెలిపారు. జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లు ఈ ఘటనలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

బకాయిలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బెస్ట్ అవేలబుల్ స్కీం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిధులు రాకపోవడంతో ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. నాయకులు కురుమయ్య, భరత్ మాణిక్యం, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సర్వే'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఏడోరోజు శుక్రవారం 49 వార్డుల పరిధిలో 4,340 ఇళ్ల వద్దకు ఎన్యుమరేటర్లు వెళ్లి ఆయా కుటుంబ యజమానుల నుంచి పూర్తి వివరాలు తీసుకున్నారు. మొత్తం 78,696 ఇళ్లకు గాను ఇప్పటివరకు 29,812 ఇళ్ల నుంచి సమగ్ర సమాచారం సేకరించగలిగారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జడ్చర్ల టౌన్: పట్టణంతోపాటు గ్రామాల్లో 11కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ తెలిపారు. సిగ్నల్‌గడ్డ ఫీడర్‌లో ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు వెంకటేశ్వరకాలనీ, గౌరిశంకర్‌కాలనీ, సాయినగర్‌కాలనీ, సరస్వతినగర్‌కాలనీల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే గంగాపురం ఫీడర్‌లో వెంకోబా వెంచర్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లోనూ ఉదయం వేళలో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు. కొండేడ్ ఫీడర్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొండేడ్, చిన్న ఆదిరాల, పెద్ద ఆదిరాల, ఎక్వాయపల్లి గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజాపూర్(బాలానగర్): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయిన్‌టెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖాధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రూప్-4లో ప్రతిభ



గ్రూప్-4 లో ఉద్యోగం పొందిన నిరేష్

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన కర్నెకోట నిరేష్ గురువారం విడుదల చేసిన గ్రూప్-4లో ప్రతిభ కనబరిచాడు. 2018లో పోలీసు ఉద్యోగం, 2019లో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. గురువారం విడుదల చేసిన గ్రూప్-4లో మూడోసారి ఉద్యోగం సాధించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తోరణం బహూకరణ

నారాయణపేట: పట్టణంలోని బారంబావి నీలకంఠ దేవాలయానికి శుక్రవారం మకర తోరణాన్ని చౌదర్ గూడెంకు చెందిన ఘట్టప్ప జ్ఞాపకార్థంతో ఆయన కుమారులు స్వామివారికి భక్తితో బహూకరించారు.



మహబూబ్‌నగర్‌లో..



మిడ్జిల్ శివాలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జడ్చర్ల: సంతోషిమాత ఆలయంలో లక్షదీపార్చన

ఆలయాల్లో కార్తీక శోభ

- భక్తులతో కిటకిలాడిన ఆలయాలు
- దీపాలు వెలిగించిన మహిళలు
- ఉదయం నుంచే ప్రత్యేకపూజలు



కందూర్ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో లక్ష దీపార్చన చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాలు, వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడికి అభిషేకాలు, పూజలు చేసి దీపాలు వెలిగించారు. పట్టణంలోని సంతోషిమాత, వాసవికన్యకాపరమేశ్వరి, సత్యనారాయణ స్వామి, వెంకటేశ్వరస్వామి, గాంధినగర్ ఆంజనేయస్వామి దేవాలయాల్లో లక్ష దీపార్చన జరిపించారు. వెంకటేశ్వరస్వామి దేవాలయం, మీనాంబరం పరుషవేదీశ్వర ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.

'లక్ష' దీపోత్సవాలు

అడ్డాకుల: కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం, మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి లక్ష దీపార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత కందూర్‌లో జరిగిన లక్ష దీపార్చనకు హాజరయ్యారు. అడ్డాకుల మండలం చిన్నమునుగల్‌ఛేడ్ ఆలయం వద్ద 1116దీపాలను వెలిగించి భక్తులు పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు లక్ష బిల్వార్చనలో పాల్గొని పూజలు చేశారు. పూలతో శివలింగం చిత్రాన్ని వేసి పూజలు చేశారు.


శివాలయంలో ప్రత్యేక పూజలు

మిడ్జిల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని శివాలయంలో ఉదయం నుంచి భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ తెలిపారు.

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాలు, శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సాయంత్రం మహిళలు వందలాది తరలివచ్చి దీపాలు వెలిగించారు.



జడ్చర్ల: భాగ్యేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జైశ్రీరామ్ ఆకారంలో దీపాలు



అడ్డాకుల మండలం చిన్నమునుగల్‌ఛేడ్ ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న దృశ్యం

కురుమూర్తిస్వామి ఆలయంలో..

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో ఏర్పాటుచేసిన కార్తీక దీపాలను వెలిగించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ మదనేశ్వరెడి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకపూజలు



నవాబుపేట: ఇప్పటూర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చిన్నారులు

నవాబుపేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వివిధ దేవాలయాల్లో కార్తీక దీపాల కాంతులు వెలిగాయి. మండల కేంద్రంతో పాటు ఇప్పటూర్, యన్మన్‌గండ్ల, కొల్లూర్, ,కూచూర్, మరికల్, కారుకొండ, దొడ్డిపల్లి, లోకిరేవు, లింగంపల్లి గ్రామాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

గౌరీవ్రతం..

మహమ్మదాబాద్: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీకశోభ సంతరించుకున్నది. అత్యంత పవిత్రమైన కార్తీకపౌర్ణమి కావడంతో ఉదయం నుంచే భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. ముఖ్యంగా ప్రతీఏటా గౌరీవ్రతం చేసే భక్తులు శుక్రవారం రాత్రి గౌరీవ్రతం నోముకున్నారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లు భజనకీర్తనలతో మార్మోగాయి.



గౌరీవ్రతం

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని కార్తీకదీపాల శోభతో కళకళలాడాయి. జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీలక్ష్మినరసింహస్వామి దేవాలయంలోని శ్రీకామేశ్వరి సమేత ఐశ్వరేశ్వరస్వామి దేవస్థానం, వెంకటేశ్వర కాలనీ రాజరాజేశ్వరీ ఆలయం, మోనప్పగుట్టలోగల శ్రీమౌనీశ్వరాలయం, బస్టాండ్ సమీపంలోని శ్రీద్వారకామయి దేవాలయం, అప్పన్నపల్లి ఆంజనేయస్వామి దేవాలయం, పరిమళగిరి వీరాంజనేయస్వామి ఆలయం, తూర్పు కమాన్ సమీపంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం, శ్రీనివాస కాలనీ పంచముఖ ఆంజనేయాలయంతో పాటు పద్మావతి కాలనీ వీరాంజనేయాలయం, నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, టీడీగుట్ట తిరుమలనాథస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సింహగిరి కామేశ్వరి సమేత ఐశ్వరేశ్వరస్వామి దేవస్థానంలో అర్చనలు చేస్తున్న భక్తులు



మౌనేశ్వరస్వామి ఆలయంలో..



బ్రాహ్మణవాడి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాలల సింహగర్జన కరపత్రాలు విడుదల



మాలల సింహగర్జన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ కళాభవన్‌లో మాలల సింహగర్జన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కో-చైర్మన్ నర్సింహయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఇచ్చిన తీర్పును నిరసిస్తూ డిసెంబర్1న పరేడ్ గ్రౌండ్‌లో 10 లక్షల మందితో మాలల సింహగర్జన చేపట్టనున్నట్లు తెలిపారు. మాలల ఆత్మగౌరవం కోసం తెలంగాణ రాష్ట్రంలో మాలలు లేరని తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మాలల శక్తి ప్రదర్శన చేయబోతున్నామన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు ఎవరు లబ్ధి పొందారో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలిపేయాలన్నారు. 2014 నుంచి నేటి వరకు రాష్ట్రంలో పెరిగిన ఎస్సీ జనాభా ప్రకారం 15 శాతం నుంచి 22 శాతానికి రిజర్వేషన్ పెంచాలన్నారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసే ప్రక్రియ ఇంతవరకు ఎందుకు ప్రారంభించలేదో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కానుగడ్డ యాదయ్య, రాష్ట్ర కో-చైర్మన్ కేశవులు, నాయకులు కంచిమి లక్ష్మణ్, బాలరాజు, కర్ణ, రమాకాంత్, కృష్ణయ్య, చెన్నకేశవులు, రాములు, రమేష్, మద్దిలేటి, భోజరాజు, నారాయణ, చెన్నయ్య, మాసయ్య, శివకుమార్, సహదేవ్, గోవింద్, బాలరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య వినోబాబావే సేవలు చిరస్మరణీయం



జయంతిలో పాల్గొన్న నాయకులు

జడ్చర్ల: ఆచార్య వినోబాబావే సేవలు చిరస్మరణీయమని సర్వోదయ మండలి రాష్ట్ర నాయకులు కృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక గాంధీ ట్రస్టు ఆవరణలో శుక్రవారం ఆచార్య వినోబాబావే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో మహాత్మాగాంధీకి అనుచరుడిగా ఉండడంతో పాటు 1951లో భూదాన ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో జడ్చర్లలోని భూదాన్ భూమిని పేదల ఇండ్ల స్థలాలకు కేటాయించే విధంగా తాము పోరాడతామన్నారు. కార్యక్రమంలో దాసు, జగన్నాథం, చంద్రకాంత్, హనుమంతు, ప్రసాద్, అజయ్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌సీఐతో జేపీఎన్‌సీ ఒప్పందం



అవగాహన ఒప్పందం పత్రాలు చూపుతున్న జేపీఎన్‌సీ చైర్మన్ రవికుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల (జేపీఎన్‌సీ) యాజమాన్యం ప్రభుత్వరంగ సంస్థ అయిన ఈఎస్‌సీఐతో హైదరాబాద్‌లో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు సిలబస్ రూపొందించడం, చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ ఒప్పందం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌సీఐ డైరెక్టర్ రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుడికి వెళ్లాలంటే.. మురుగు దాటాల్సిందే!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని నెలలుగా స్థానిక పద్మావతి కాలనీలోని కృష్ణా టెంపుల్ చౌరస్తాలో నడిరోడ్డుపై మురుగు ఏరులై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని భక్తులు, స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి ఎగువ గుట్ట ప్రాంతంలో ఉన్న సుమారు పది ఇళ్ల నుంచి మురుగు కిందికి నడిరోడ్డుపైకి వస్తోందన్నారు. అక్కడి నుంచి నలు కూడలి మీదుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయమై పలుమార్లు వార్డు కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కడం లేదన్నారు. సమీపంలోనే కాళికామాత దేవస్థానం, కృష్ణుని గుడి ఉండటంతో భక్తులు కాలినడకన ప్రతిరోజూ ఈ మురుగుపై నుంచి దాటి వెళ్లాల్సి వస్తోంది. ఇదే మార్గంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నివాస గృహం ఉండటం గమనార్హం. ఇప్పటికైనా స్పందించి వెంటనే డ్రెయినేజీ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



కృష్ణా టెంపుల్ చౌరస్తాలో మురుగు పై నుంచి వెళ్తున్న భక్తులు, వాహనదారులు

మానసిక స్థితి నుంచి కోలుకున్న మరో వ్యక్తి



పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు రాజును అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి సేవా ట్రస్టు నిర్వహిస్తున్న సత్యేశ్వర ఆశ్రమంలో ఆశ్రయం పొంది కోలుకుని సొంత ఇంటికి చేరుకుంటున్న వారి సంఖ్య శుక్రవారంతో 111కు చేరింది. వనపర్తికి చెందిన రాజు అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి అమిస్తాపూర్ గ్రామంలో రోడ్డుపై సంచరిస్తుండగా ఆశ్రమ నిర్వహకులు చిత్తనూరి ఈశ్వర్ రెండేళ్లక్రితం ఆశ్రమానికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆశ్రమంలో చికిత్స అందించటంతోపాటు యోగ, ధ్యానం వల్ల మతిస్థిమితం నుంచి కోలుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యుల వివరాలను ఆశ్రమ నిర్వహకులకు తెలిపాడు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ద్వారా రాజు అన్న వదినలు బాలయ్య శివమ్మ, అక్క బావలు రాణి, శ్రీనులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వారు శుక్రవారం ఆశ్రమానికి చేరుకుని రాజును చూసి కన్నీరుమున్నీరయ్యారు. తల్లిదండ్రులు లేకపోవటంతో రాజును ఎంతో గారాబంగా పెంచామని, రెండేళ్లక్రితం కనిపించకుండా పోవటంతో వెతికి వెతికి వేసారిపోయినట్లు పేర్కొన్నారు. తమ పిల్లాడిని మానసిక స్థితినుంచి బాగుచేసిందుకు ఆశ్రమ నిర్వహకులు చిత్తనూరి ఈశ్వర్, చిత్తనూరి రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోలీసుల సమక్షంలో రాజును కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆశ్రమంలో ఉట్టిపడిన ఆధ్యాత్మికత



ప్రణవ పతాక వేడుకల్లో స్వాములు

- అట్టహాసంగా వార్షికోత్సవాలు
- లక్ష్మీనారాయణ కల్యాణం
- 108కిలోల కుంకుమతో అమ్మవారికి అర్చన
- హాజరైన పలువురు పీఠాధిపతులు

జడ్చర్ల టౌన్: మండలంలో గంగాపురం వద్ద ఉన్న మళయాళస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. శుక్రవారం ఆశ్రమ 20వ వార్షికోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవతో ప్రారంభమైన వేడుకలు 7గంటలకు శివుడికి రుద్రాభిషేకం, 8గంటలకు ప్రణవ పతాకావిష్కరణ, అఖండజ్యోతి ప్రజ్వలన చేశారు. గీతాపారాయణం చేశాక సభ నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మనందగిరి స్వామి అధ్యక్షతన జరిగిన సభలో యాదగిరిగుట్ట బుచ్చిదాసు పీఠాధిపతి శంకరానందగిరి, విజయవాడ పరమాత్మానంద ఆశ్రమం పీఠాధిపతి ప్రకాశానంద, పోతులమడుగు సీతారామంజనేయ ఆశ్రమం పీఠాధిపతి తిరుపతి తీర్థానంద, ఇస్కాన్ సంస్థ ధర్మప్రచారకులు హిమసుందర్‌దాస్‌తో పాటు పలువురు పీఠాధిపతులు హాజరయ్యారు. వీరు భగవద్గీతపై ఉపన్యసించారు. సాయంత్రం 108కిలోల కుంకుమతో అమ్మవారికి అర్చన చేశారు. లక్ష్మీనారాయణ కళ్యాణోత్సవం జరిపించారు. ధార్మిక సభలో ముందూర్ రాజాశ్రమ పీఠాధిపతి కృష్ణచరణానందభారతి, బళ్లారి శ్రీకుటీరం పీఠాధిపతి నిత్యానందభారతి, తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షుడు శంకర్‌స్వామి శ్రీమద్రామయణముపై సందేశాలు ఇచ్చారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని దీపోత్సవం జరిపించారు. వేడుకల్లో భాగంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు దివంగత నిత్యశుద్ధానందగిరితో స్వాములు తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని, అనుబంధాలను పంచుకున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా.?



గుంతమయంగా మారిన రాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు

- గుంతలమయంగా మారిన రాయపల్లి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పోలీసులు

రాజాపూర్: మండలంలోని రాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఈరోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి రాయపల్లి గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల తారురోడ్డు ఉంది. గ్రామానికి సమీపంలో దుందుభీనది ప్రవహిస్తోంది. దీంతో ఇసుక మాఫియా భారీవాహనాలతో నిత్యం ఈరోడ్డు గుండా రాకపోకలు సాగిస్తోంది. దీంతో తారురోడ్డు గుంతలమయంగా మారింది. ఇసుక మాఫియాపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గత సంవత్సరం అక్కడే ఏర్పాటుచేసిన రెడిమిక్స్ ప్లాంట్ నుంచి భారీవాహనాలు వెళ్తున్నాయి. దీంతో ఆరోడ్డు మరింతగా దెబ్బతిన్నది. ప్రతిరోజు సమీపంలో ఉన్న సెజ్‌లోకి విధులకు వెళ్లే కార్మికులు, ప్రజలు ఈగుంతల్లో పడి ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదు

నవాబుపేట: తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రాబోతుందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్, నవాబుపేట గ్రామాల్లో పార్టీ సభ్యత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో నేటికీ 28వేల సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కృష్ణరెడ్డి, స్వామి, పాండు తదితరులు ఉన్నారు.